క్లుప్తంగా

నేటి నుంచి ముషకుల్‌కుషా ఉర్సు

భూత్పూర్: మండలంలోని కొత్తమొల్గరలో హజరత్ మౌలాఅల్లి ముషకల్‌కుషా ఉర్సు నేటి(శుక్రవారం) నుంచి ప్రారంభం కానున్నట్లు నిర్వాహకులు ఎండాతు జహంగీర్, ఎండాతు ముజీబ్, ఎండీ అల్తాఫ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం సాయంత్రం 5గంటలకు గంధోత్సవం, శనివారం గుట్టపై ఉర్సు నిర్వహిస్తున్నార న్నారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన భక్తులు అధికసంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.

ఆలయంలో టైల్స్ పనులు ప్రారంభం

జడ్చర్ల టౌన్: మండలంలోని కోడుపర్తి ఆంజనేయస్వామి ఆలయం అభివృద్ధి పనుల్లో భాగంగా గర్భాలయం, ముఖమంటపానికి గ్రానైట్స్, టైల్స్ పనులకు గంగాపురానికి చెందిన విష్ణుమూర్తి, సరోజ దంపతులు గురువారం పూజలుచేసి ప్రారంభించారు. పనుల ప్రారంభంలో ఆలయ అర్చకులు నందిపేట లక్ష్మణాచార్యులు, అలయ కమిటి అధ్యక్షుడు శ్రీనివాసులు, సభ్యులు భాస్కర్, గౌరిశంకర్, బాబుగౌడ్, చెన్నప్ప పాల్గొన్నారు.

శివమాల ధరించిన భక్తులు



నవాబుపేట: మండలంలోని ప్రసిద్ధ శైవక్షేత్రం లోకిరేవు వీరభద్రస్వామి ఆలయంలో గురువారం శివభక్తులు శివమాల ధరించారు. వివిధ గ్రామాలకు చెందిన భక్తులకు పూజారి నందీశ్వరస్వామి మాల ధరింప చేశారు. వారంతా శివరాత్రి వరకు దీక్షలో ఉండి శివరాత్రి పర్వదినాన శ్రీశైలంలో ఇరుముడి సమర్పించి దీక్ష విరమిస్తారని పూజారి తెలిపారు. ఇన్నాళ్లు అయ్యప్ప నామస్మరణతో మార్మోగిన పల్లెలు తాజాగా శివనామ స్మరణతో హోరెత్తనున్నాయి.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత



భూత్పూర్: మండలంలోని అన్నాసాగర్, తాటిపర్తి, కొత్తూర్ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను గురువారం భూత్పూర్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి అందజేశారు. అన్నాసాగర్‌కు చెందిన గోపమ్మకు రూ.2.50లక్షలు, లక్ష్మికి రూ.28వేలు, కొత్తూర్‌కు చెందిన జయమ్మకు రూ.18వేలు, తాటిపర్తికి చెందిన జ్యోతికి రూ.60వేలు, యాదయ్యకు రూ.15వేల చెక్కులను ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల యూత్ అధ్యక్షుడు భూపతిరెడ్డి, మాధవరెడ్డి, కృష్ణారెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, వడ్డె శ్రీను తదితరులున్నారు.

బోయపల్లిలో సైనికులకు సన్మానం



మహబూబ్‌నగర్ రూరల్: పట్టణంలోని బోయపల్లిలో బీసీ ఐక్య సంఘం ఆధ్వర్యంలో గురువారం ఆర్మీ డేను పురస్కరించుకొని సైనికులకు శాలువాలు కప్పి పూలమాలలతో సత్కరించారు. గొల్ల కేశవులు, జలనీల నాగేందర్, గౌడుగు పురుషోత్తంలను సత్కరించి వారి సేవలను కొనియాడారు. దేశ రక్షణ కోసం సైనికులు అహర్నిశలు కష్టపడుతుంటారని కౌన్సిలర్ మోతీలాల్ అన్నారు. కార్యక్రమంలో బీసీ ఐక్య సంఘం అధ్యక్షుడు సత్యం, ప్రధాన కార్యదర్శి యాదగిరి, వినోద్‌గౌడ్, భగవాన్, మాధవచారి, ఆంజనేయులు, యాదయ్య, వెంకటయ్య, జె.సత్యం పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



మల్లేష్ (ఫైల్)

రాజాపూర్: హైదరాబాద్‌లో పనికోసం వెళ్లిన వ్యక్తి ఆచూకీ రెండు నెలలుగా లభ్యంకాక పోవడంతో కుటుంబ సభ్యులు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐరవి తెలిపారు. వివరాలు.. బాలానగర్ మండలం చిన్నరేవల్లికి చెందిన దాసింగాని మల్లేష్ నవంబర్ 12న హైదరాబాద్‌లో పనికోసం వెళ్లాడు. రెండు నెలల నుంచి ఫోన్ కూడా చేయకపోవడంతో కుటుంబ సభ్యులు బంధువుల వద్ద వెతికారు. ఎలాంటి ప్రయోజనం లేకపోవడంతో మల్లేష్ బామ్మర్ది ఎరువుల అంజయ్య రాజాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



బొక్కలోనిపల్లిలో సర్వే వివరాలు తెలుసుకుంటున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి
- గ్రామాల్లో, పట్టణాల్లో కొనసాగుతున్న సర్వే
- వివరాలు సేకరిస్తున్న అధికారులు

మహబూబ్‌నగర్ రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని జమిస్తాపూర్, బొక్కలోనిపల్లిలో ఎంపీడీఓ కరుణశ్రీ, డిప్యూటీ తహసీల్దార్ సువర్ణ, ఏఈఓ కృష్ణకాంత్‌లతో కలిసి సర్వే నిర్వహించారు. బొక్కలోనిపల్లిలో ప్రభుత్వ సంక్షేమ పథకాల సర్వే తీరు అధికారులను నర్సింహారెడ్డి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలు లబ్ధి జరిగేలా చూడాలని కోరారు. ఎంపీడీఓ కరుణశ్రీ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం రైతు భరోసా కోసం రైతుల పొలాల్లో ఏమైనా కట్టడాలు, ప్లాట్లు ఉన్నాయా, లేవా అనే వాటిని పరిశీలించి రికార్డుల్లో నమోదు చేయనున్నట్లు తెలిపారు. వ్యవసాయ యోగ్యమైన రైతుల భూములకు మాత్రమే రైతు భరోసా పథకం వర్తిస్తుందని అన్నారు. సర్వే పూర్తయిన తర్వాత గ్రామాలలో రైతుల వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.

కొత్త రేషన్ కార్డుల..

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక 21వ వార్డు పరిధిలోని శేషాద్రినగర్‌లో గురువారం కొత్త రేషన్ కార్డుల సర్వేను మున్సిపల్ చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్‌కార్డు లేని పేదలకు అందిస్తామన్నారు. ఈ సర్వేలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. మొత్తం 49వార్డులలో ఈ సర్వే ముమ్మరం చేయాలన్నారు.

విడతలవారీగా వర్తింపజేస్తారు..

మహమ్మదాబాద్: అర్హులైన వారందరికీ ప్రభుత్వ పథకాలు విడతలవారీగా వర్తింపజేస్తారని తహసీల్దార్ తిరుపతయ్య, ఎంపీఓ నరేందర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని వెంకట్‌రెడ్డిపల్లి, కంచన్‌పల్లి, మొకర్లాబాద్, ముందలితండా గ్రామాల్లో సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ఏఈఓలు, కార్యదర్శులు ఉన్నారు.

మున్సిపాలిటీతో పాటు గ్రామాల్లో

భూత్పూర్: మున్సిపాలిటీతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో తహసీల్దార్ రహమాన్, ఎంపీడీఓ ప్రభాకర్, ఎంపీఓ శ్రీదేవి, వ్యవసాయాధికారి మురళీ బృందాలుగా ఏర్పడి గురువారం సర్వేను నిర్వహించారు. ఏఓ మురళీధర్, ఏఈఓలు మౌనిక, రక్షిత గ్రామ కార్యదర్శులున్నారు.

ఇంటింటికెళ్లి సర్వే...

నవాబుపేట: మండలంలోని కూచూర్, ఇప్పటూర్, చెన్నారెడ్డిపల్లి, మల్లారెడ్డిపల్లి గ్రామాల్లో గురువారం ఇంటింటికెళ్లి సర్వే నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ జయరాంనాయక్ తెలిపారు. మండల అధికారులతో కలిసి సర్వేలో ఆయన పాల్గొన్నారు. ఏపీఓ జ్యోతీ, పంచాయతీ అధికారులు కల్పన తదితరులున్నారు.

గ్రామాల్లో అధికారుల బృందం..

మిడ్జిల్: మండలంలోని రాణిపేట్, కొత్తపల్లి, లింబ్యాతండా, అయ్యవారిపల్లి గ్రామాల్లో అధికారుల బృందం సర్వే నిర్వహించినట్లు ఎంపీడీఓ గీతాంజలి తెలిపారు. ఈసర్వేలో ఈఓ సిద్దార్థ తదితరులు పాల్గొన్నారు.

వివరాలు నమోదు..

అడ్డాకుల: అడ్డాకుల, మూసాపేట మండలాల్లోని గ్రామాల్లో కొత్త రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నవారి ఇళ్లకు వెళ్లి అధికారులు వివరాలు సేకరించి నమోదు చేస్తున్నారు. మూసాపేటలో ఎంపీడీఓ కృష్ణయ్య, ఎంపీఓ అనురాధ, కార్యదర్శి మహేందర్ గ్రామంలో తిరుగుతూ విచారణ చేపట్టారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు శెట్టిశేఖర్ తదితరులున్నారు.





మహబూబ్‌నగర్‌లో సర్వేను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్.. నవాబుపేట మండలం ఇప్పటూర్‌లో..

సేవాభావం అలవర్చుకోవాలి



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ప్రతి ఒక్కరూ సేవాభావం అలవర్చుకోవాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. గురువారం రాత్రి క్యాంపు కార్యాలయంలో తెలంగాణ ఆరోగ్యశ్రీ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం, తెలంగాణ స్టేట్ టీచర్స్ యూనియన్ల (టీఎస్‌టీయూ) కొత్త క్యాలెండర్లను వేర్వేరుగా ఆవిష్కరించారు. అంతకుముందు విద్యానిధికి రూ.పది వేల విలువజేసే చెక్కును పట్టణానికి చెందిన న్యాయవాది రాఘవేందర్, ప్రసన్నలక్ష్మి దంపతులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజా ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందన్నారు. పేదలకు ఉచిత వైద్యం అందించాలనే ఉద్దేశంతో ఆరోగ్యశ్రీ నిధి రూ.10లక్షలకు పెంచామన్నారు. పదోతరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఆయా సంఘాల నాయకులు కె.గిరిప్రసాద్, వై.రాజేంద్రకుమార్, ఎం.మురళీమోహన్, డి.సంజీవ, కె.ఆంజనేయులు, వి.సతీష్‌కుమార్, హమీద్, అశోక్‌కుమార్, విన్సెంట్, మహ్మద్ ముస్తాఫ, కాంగ్రెస్ నాయకులు సిరాజ్‌ఖాద్రీ, బుద్దారం సుధాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, యాదిరెడ్డి, గుండా మనోహర్ పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండాలి



సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

నవాబుపేట: ప్రస్తుతం సైబర్ నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండాలని హెడ్ కానిస్టేబుల్ సురేష్‌బాబు అన్నారు. గురువారం మండల కేంద్రంలో యువతకు సైబర్ నేరాలపై పోలీసులు అవగాహన కల్పించారు. తాజాగా సైబర్ మోసాలు జరుగుతున్న తీరును ఆయన వివరించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే జైలు శిక్షతో పాటు జరిమానా విధిస్తామని అన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నర్సింహాచారి, పోలీసు సిబ్బంది గులాం, యువజన నాయకులు శ్రీనివాస్, సురేష్, మల్లేష్, రవీందర్, శివ, అంజి తదితరులున్నారు.

రోడ్డు వేయాలంటూ బీఆర్‌ఎస్ నాయకుల రాస్తారోకో



చౌలతండా స్టేజీవద్ద రాస్తారోకో చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

భూత్పూర్: మండలంలోని చౌలతండా స్టేజీ నుంచి కర్వెన వరకు బీటీ రోడ్డు వేయాలంటూ బీఆర్‌ఎస్ నాయకులు, తండావాసులు గురువారం రాస్తారోకో నిర్వహించారు. దీంతో అర కిలోమీటర్ మేర వాహనాలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజన తండాల అభివృద్ధి నిధుల నుంచి రూ.2.20కోట్లు మంజూరై ఏడాది కావస్తున్నా అధికారులు, ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. వెంటనే బీటీ రోడ్డు వేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈవిషయమై డీఈ వి.సింగ్‌ను వివరణ కోరగా నాలుగు సార్లు టెండర్లు పిలిచామని, కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదన్నారు. సోమవారం మళ్లీ రీటెండర్లు పిలుస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో చౌలతండా మాజీ సర్పంచ్ శ్రీను, కర్వెన మాజీ ఉపసర్పంచ్ బాల్‌రెడ్డి, నాయకులు మల్లేష్, తండావాసులు పాల్గొన్నారు.

హక్కుల కోసం పోరాడుదాం



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న యాదవసంఘం నాయకులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): యాదవుల హక్కుల సాధన కోసం ఐక్యంగా పోరాడుదామని జిల్లా గొర్రెల పెంపకదారుల సహకార సంఘం చైర్మన్ శాంతన్న యాదవ్ అన్నారు. అఖిల భారత యాదవ మహాసభ మహబూబ్‌నగర్ జిల్లా యువత ప్రధాన కార్యదర్శి చందుయాదవ్ ఆధ్వర్యంలో స్థానిక కార్యాలయంలో గురువారం క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అఖిల భారతయాదవ మహాసభ రాష్ట్ర కార్యదర్శి వై రవికుమార్‌యాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు గొండ్యాల రమేష్‌యాదవ్, నియోజకవర్గ అధ్యక్షుడు సాయిలుయాదవ్, యాదవ విద్యావంతుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బైకని బాలు యాదవ్, విద్యావంతుల వేదిక జిల్లా అధ్యక్షులు అంజన్న యాదవ్, ఉద్యోగ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటరాములు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ విజేత కొత్తగంజ్ జట్టు



విజేత జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు ఎస్.పీ.వెంకటేష్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక కొత్తచెరువు రోడ్ ప్రాంతంలో మూడు రోజులపాటు నిర్వహించిన క్రికెట్ పోటీల్లో కొత్తగంజ్ జట్టు విజేతగా నిలిచింది. చివరిరోజు గురువారం టీడీగుట్ట జట్టు రెండో స్థానం కైవసం చేసుకుంది. ఈ పోటీల్లో మొత్తం 14జట్లు పాల్గొనగా మొదటి స్థానం దక్కించుకున్న జట్టుకు రూ.15వేలతో పాటు ట్రోఫీని జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు ఎస్.పీ.వెంకటేష్ అందజేశారు. రెండో స్థానంలో నిలిచిన జట్టుకు రూ.ఐదు వేల నగదు బహుమతి ఇచ్చారు. కార్యక్రమంలో నిర్వాహకులు రవియాదవ్, యాదయ్య, తిరుపతి, శంకర్, నందిపేట రాజు పాల్గొన్నారు.

మిత్రుడి కుటుంబానికి ఆర్థిక సాయం



మిత్రుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

అడ్డాకుల: మండలంలోని పెద్దమునుగల్‌ఛేడ్ గ్రామానికి చెందిన ఎండీ జాహంగీర్ ఇటీవల గుండెపోటుతో మృతిచెందాడు. 2003–04వ సంవత్సరానికి చెందిన పూర్వవిద్యార్థులు మిత్రుడి కుటుంబానికి అండగా నిలిచారు. అందరూ కలిసి రూ.26వేల చెక్కును గురువారం మృతుడి భార్య నసియాబేగంకు అందజేశారు. ఆర్థికసాయం చేసిన పూర్వవిద్యార్థులకు బాధిత కుటుంబం కృతజ్ఞతలు తెలిపింది. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు చంద్రశేఖర్, శ్రీనివాస్ యాదవ్, శ్రీనునాయక్, రాజు, నరేష్‌సాగర్, రవీందర్‌రెడ్డి, శ్రీకాంత్, మల్లేష్, రాజ్‌కుమార్, వహీద్, సాయికుమార్ ఉన్నారు.

ఇసుక డంపులు సీజ్



పోల్కంపల్లి వద్ద అక్రమంగా నిల్వ చేసిన ఇసుకను సీజ్ చేస్తున్న అధికారులు

అడ్డాకుల: మూసాపేట మండలం పోల్కంపల్లిలో గురువారం నాలుగు ట్రాక్టర్ల ఇసుక డంపులు పోలీసులు సీజ్ చేశారు. గ్రామానికి సమీపంలో ఉన్న పెద్దవాగు నుంచి కొందరు అక్రమార్కులు రాత్రివేళ అక్రమంగా ఇసుక తవ్వకాలు చేపట్టారు. వాటిని వాగు సమీపంలోని పొలాల్లో రెండు చోట్ల అక్రమంగా నిల్వచేశారు. వాటిని గుర్తించిన గ్రామస్తులు అధికారులకు సమాచారమివ్వడంతో గిర్దావర్ అరుణ్, పోలీసులు అక్కడికి వెళ్లి అక్రమంగా నిల్వచేసిన ఇసుకను పరిశీలించి సీజ్ చేశారు. ఈ ఇసుకను వాహనాల్లో మూసాపేట తహసీల్దార్ కార్యాలయానికి తరలించినట్లు తహసీల్దార్ రాజు తెలిపారు. అక్రమ ఇసుక నిల్వల వెనుక ఎవరున్నారన్న దానిపై అధికారులు ఆరా తీస్తున్నారు. ఇసుకను నిల్వచేసినది ఎవరనేది తేలితే పోలీసు కేసు నమోదయ్యే అవకాశం కూడా లేకపోలేదు. కొన్నాళ్ల నుంచి ఇసుక అక్రమ రవాణా నిలిచిపోగా తాజాగా ఇసుక నిల్వలు బయట పడటం మండల వ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

క్రీడలతో క్రమశిక్షణ

నవాబుపేట: క్రీడలతో క్రమశిక్షణ అలవర్చుకొని యువత ముందుకు సాగాలని డీసీసీ ప్రధానకార్యదర్శి బంగ్లరవి అన్నారు. గురువారం మండలంలోని చౌడూర్‌లో వారం రోజుల పాటు నిర్వహించిన క్రికెట్ పోటీ విజేతలకు ఆయన బహుమతులు అందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చిన్నయ్య, అమరేష్, వెంకటేష్, నర్సింహులు, సిద్దు, వెంకటయ్య, తిరుపతయ్య, రఘు, రమేష్ తదితరులు ఉన్నారు.

సమగ్ర నివేదిక తీసుకురండి

పాలమూరు: జిల్లా జనరల్ ఆస్పత్రికి కావాల్సిన ఆపరేషన్ థియేటర్ పరికరాలు, ఇతర సామగ్రికి చెందిన సమగ్ర నివేదికను తీసుకొని ఈనెల 18న హైదరాబాద్‌కు రావాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సంపత్‌కుమార్‌సింగ్‌కు రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా సూచించారు. గురువారం ఆయన ఆస్పత్రికి కావాల్సిన పరికరాలు, సామగ్రి కోసం మంత్రిని కలిసి నివేదిక అందించారు. ఎంసీహెచ్ భవనంలో ఉన్న లిఫ్ట్, పాత భవనం మరమ్మతులతో పాటు ఆస్పత్రికి కావాల్సిన బడ్జెట్‌పై మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. మంత్రి సానుకూలంగా స్పందించి సమగ్ర నివేదికను తీసుకురావాలని సూచించినట్లు సూపరింటెండెంట్ ఆయన తెలిపారు.

మైక్‌సెట్ వితరణ

కోయిల్‌కొండ: మండల కేంద్రంలోని శ్రీఆదిఆంజనేయస్వామి దేవాలయానికి మండలంలోని అనంతపూర్ గ్రామానికి చెందిన పారిశుద్ధ్య కార్మికుడు ఆంజనేయులు రూ.22 వేల విలువ గల మైక్‌సెట్‌ను వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు డిఎం. రాఘవేందర్‌రావు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

చిన్నచింతకుంట: మండలంలోని ఏదులాపూరంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు శ్రీనివాస్‌గౌడ్ తల్లి కొన్నిరోజుల క్రితం అనారోగ్యంతో మరణించింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి గురువారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రెటరీ అరవింద్‌కుమార్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు రాఘవేందర్‌రెడ్డి, మదనాపురం మార్కెట్ చైర్మన్ ప్రశాంత్, కురుమూర్తి స్వామి దేవస్థానం చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి,నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, శాంతిరెడ్డి, సుదర్శన్, దేవేందర్‌రెడ్డి, ఎల్ రాఘవేందర్‌రెడ్డి, కమలాకర్, వేముల రాజరెడ్డి, యాదిరెడ్డి, సంజన్న, బోయ చందు తదితరులున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

అడ్డాకుల: మూసాపేట మండలం చక్రాపూర్ స్టేజీ వద్ద 44వ నంబర్ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలైనట్లు పోలీసులు తెలిపారు. వివరాలు.. భూత్పూర్ మండలంలోని తాటిపర్తికి చెందిన హుస్సేన్‌బాబా బైక్‌పై చక్రాపూర్ వైపు వెళ్తున్నాడు. చక్రాపూర్ స్టేజీ వద్ద రోడ్డు దాటుతున్న బైక్‌ను మహబూబ్‌నగర్ వైపు వెళ్లే కారు ఢీకొట్టింది. హుస్సేన్‌బాబా రోడ్డుపై పడిపోవడంతో కాలు విరిగింది. స్థానికులు బాధితుడిని అంబులెన్స్‌లో జిల్లా కేంద్రానికి తరలించారు.

నేత్రదానం



నర్సింహారెడ్డి (ఫైల్)

జడ్చర్ల టౌన్: పట్టణానికి చెందిన తాళ్లగడ్డ నర్సింహారెడ్డి(65) అనారోగ్యంతో చనిపోగా కుటుంబసభ్యుల ఆమోదంతో రెండు కళ్లను దానంచేసి ఇద్దరికి చూపు వచ్చేలా చేశారు. వివరాలు.. నర్సింహారెడ్డి మహబూబ్‌నగర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏఓగా పనిచేసి పదవీవిరమణ పొంది జడ్చర్లలో నివాసం ఉంటున్నారు. ఇటీవల అనారోగ్యానికి గురికాగా జిల్లాకేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్సపొందుతూ బుధవారం సాయంత్రం మృతిచెందారు. మరణానంతరం తన కళ్లను దానం చేయాలన్న ఆయన కోరిక మేరకు భార్య లలిత, కుమారుడు రాజేశ్వర్‌రెడ్డి, కూతురు కీర్తి ప్రజా సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు ప్రవీణ్‌ను సంప్రదించారు. ఆయన రెడ్‌క్రాస్ చైర్మన్ నటరాజ్‌కు సమాచారమిచ్చారు. జిల్లా ఆస్పత్రిలో ఉన్న ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి టెక్నిషియన్ శివ బుధవారం రాత్రి ఆస్పత్రికి చేరుకుని మృతుడి నుంచి రెండు కళ్ల (కార్నియా)లు సేకరించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులకు కార్నియా సేకరించినట్లుగా ధ్రువపత్రాన్ని అందజేశారు. రెడ్‌క్రాస్ చైర్మన్ నటరాజ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నేత్రదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. నేత్రదానం కోసం 9666900900 నంబర్‌కు సంప్రదించాలని కోరారు. మృతుడు నర్సింహారెడ్డి అంత్యక్రియలు గురువారం జడ్చర్లలో నిర్వహించారు.

పశువైద్యం.. బహుదూరం..

- వేధిస్తున్న వైద్యుల కొరత
- ఇబ్బందులు పడుతున్న పాడిరైతులు



నవాబుపేటలోని పశువైద్యశాల

నవాబుపేట: మండలంలో పశువులకు వైద్యం రోజురోజుకు దూరమవుతోంది. జిల్లా కేంద్రానికి అతి సమీపంలో ఉన్న మండలంలో పశువైద్యం విషయంలో కష్టాలు తప్పడం లేదు. మండలంలో నవాబుపేట, కొల్లూర్‌లో ప్రధాన ఆస్పత్రులు ఉన్నాయి. అలాగే కాకర్లపహాడ్, కార్‌కొండ, ఇప్పటూర్, లింగంపల్లి, పోమాల్, చౌడూర్, గురుకుంట గ్రామాల్లో పశువైద్య ఉపకేంద్రాలున్నాయి . ప్రధాన ఆస్పత్రుల్లో వైద్యులు విధులు నిర్వహిస్తుండగా ఉపకేంద్రాల్లో ఎల్ఎఫ్ఎల్ ఇన్‌చార్జిలుగా వ్యవహరిస్తారు. మండలం మొత్తం కేవలం కొల్లూర్ ఆస్పత్రిలో మాత్రమే డాక్టర్ అందుబాటులో ఉండగా తాజాగా రెండు రోజుల క్రితం ఆయన సైతం బదిలీ అయ్యారు. వైద్యులు లేక పశువులకు వైద్యం అందక పాడి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఇద్దరు డాక్టర్లు, ఏడుగురు ఎల్ఎఫ్ఎల్‌లు, 9మంది కాంపౌండర్లు విధులు నిర్వహించాల్సి ఉంది. కాగా ప్రస్తుతం ఏడుగురు కాంపౌండర్లు, ముగ్గురు ఎల్ఎఫ్ఎల్‌లు మరో నాలుగు మంది ఇతర సిబ్బంది పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కాకర్లపహాడ్, కార్‌కొండ ఆస్పత్రుల్లో ఎల్ఎఫ్ఎల్ సిబ్బంది సైతం అందుబాటులో లేరు. ఇప్పటూర్, లింగంపల్లి, పోమాల్, చౌడూర్‌లో కాంపౌండర్లు సైతం లేరు. కేవలం ఇద్దరు కంపౌండర్లతోనే మండలం మొత్తం పశువైద్యం కొనసాగుతుంది.

ఆందోళనలో రైతాంగం

మండలంలో ఇప్పుడిప్పుడే పాడిరంగం అభివృద్ధి వైపు పయనిస్తోంది. ఇలాంటి తరుణంలో పశువైద్యం సరిగా లేకపోవడంతో పాడి రైతాంగం ఆందోళన వ్యక్తం చేస్తుంది. గ్రామాల్లో ఆవు, గేదెలకు పశువైద్యం కరువైతే ప్రభుత్వ లక్ష్యం నీరుగారిపోతుంది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యం అందకపోవడంతో మందులు లభించకపోవడంతో ప్రైవేట్ మందుల దుకాణాలను సంప్రదించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

కాంపౌండరే దిక్కు



కాంపౌండరే పశువులకు వైద్యం అందిస్తాడు. అతడు వచ్చినప్పుడే ఆస్పత్రి తెరుస్తారు. మండల కేంద్రంలోనైనా అందుబాటులో ఉంటే ఎలాగైనా కాలం గడిపేవాళ్లం అదికూడా గతేడాదిగా కరువైంది. డాక్టర్‌తో వైద్యం కావాలంటే ప్రత్యేక వాహనం మాట్లాడి వాహనంలో డాక్టర్ ఉన్న చోటుకు పశువును తీసుకెళ్లాలి.

– పాండు, పాడిరైతు, హాజిలాపూర్